క్లుప్తంగా

అంధకారంలో బస్టాండ్



చెన్నారావుపేట : బస్టాండ్ ఆవరణలోని విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన లైట్ కొద్ది రోజులుగా పని చేయకపోతుండడంతో అంధకారం నెలకొంటోంది. రాత్రి వేళల్లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లోని లైట్‌ను, ఇతర సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా గ్రామ పంచాయతీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది చొరవ తీసుకుని లైట్ వెలిగేలా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

కబడ్డీ, రెజ్లింగ్‌లో ఉచిత శిక్షణ

నర్సంపేట రూరల్ : వేసవి నేపథ్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలో మే 1 నుంచి 31 వరకు కబడ్డీ, రెజ్లింగ్ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూత్ అండ్ స్పోర్ట్స్ జిల్లా అధికారి టీవీఎల్.సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఉదయం 6 నుంచి 8 గంటలు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాల కోసం 9666623438, 6305271260 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తీన్మార్ మల్లన్నకు సత్కారం



పర్వతగిరి : మే నెలలో జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేయనున్న తీన్మార్ మల్లన్నను తెలంగాణ అంబేడ్కర్ సంఘం నాయకులు సత్కరించారు. మల్లన్న హనుమకొండకు సోమవారం వచ్చిన సందర్భంగా అంబేడ్కర్ సంఘం నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, నాయకులు మంద రవీందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వర్ధన్నపేట : ఒక ద్విచక్ర వాహనం మరో ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కట్ర్యాలలో సోమవారం చోటచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కట్ర్యాలకు చెందిన చెంగల అంజయ్య ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఎల్లయ్య, రామచంద్రు వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజయ్యతోపాటు ఎల్లయ్య, రామచంద్రు గాయపడగా స్థానికులు 108లో వారిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నివాళి



నర్సంపేట : పట్టణంలోని పదో వార్డుకు చెందిన ఆరెపల్లి మనోహరస్వామి సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎదురబోయిన రామస్వామి, వలస సత్యం, ఆరెపెల్లి బాబు, పస్తం ఎల్లస్వామి, పాస్టర్ రూబెన్, రఘుపతి, పస్తం కృష్ణ, ఆరెపెల్లి కిరణ్, గ్యార శ్రీకాంత్, పస్తం హనుమంతు, కంజర్ల అమీన్, బుడిగె భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన సులేమాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. అనంతరం రూ.7 వేల నగదు సాయంగా అందజేసి ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, పాడుపుగంటి మధు, మోడెం ఎల్లాగౌడ్, లాల్‌సాహెబ్, చాంద్ పాషా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న జీపీ ట్రాలీ ఆటోలు

● పల్లెల్లో చెత్త సేకరణలో తిప్పలు

నర్సంపేట రూరల్ : గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లను, ట్రాలీ ఆటోలను కొనుగోలు చేయించి జీపీలకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలు పంచాయతీల్లో ట్రాలీ ఆటోలు మొరాయిస్తున్నాయి. దీంతో పల్లెల్లో చెత్త సేకరణలో తిప్పలు తప్పడం లేదు.

నర్సంపేట మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉండగా పాత ముగ్దుంపురం గ్రామపంచాయతీని చెన్నారావుపేట మండలంలో కలపడంతో మొత్తం 26 గ్రామపంచాయతీలు మిగిలాయి. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ దామాలు, డంపింగ్ యార్డుల తోపాటు గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ట్రాక్టర్ లేదా ట్రాలీ ఆటోలు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో నర్సంపేట మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, నాలుగు జీపీలకు మినీ ట్రాక్టర్లు, ఏడు గ్రామాలకు ట్రాలీ ఆటోలు కొనుగోలు చేశారు. బోజ్యానాయక్‌తండా, చిన్న గురిజాల, ఎనుగల్‌తండా, జీజీఆర్‌పల్లి, ముత్యాలమ్మతండా, పర్మనాయక్‌తండా, రాజేశ్వర్‌రావుపల్లి, తదితర చిన్న గ్రామ పంచాయతీలకు తక్కువ బడ్జెట్‌తో ఆటోలు కొనుగోలు చేశారు. సుమారు రూ.2 లక్షలు చొప్పున వెచ్చించి కొనుగోలు చేసిన ట్రాలీ ఆటోలు ఏడాది పాటు బాగానే నడిచినా తదనంతరం మొరాయించడం మొదలైంది. వాటి మరమ్మతుల కోసం అవసరమైన పరికరాలు వరంగల్, హనుమకొండల్లో దొరికిన సందర్భాల్లో మరమ్మతు చేయించారు. వాటి కంపెనీ కొంత కాలం క్రితం కరీంనగర్‌కు మారడంతో పరికరాలు దొరకని



మూలకు పడిన ఏనుగల్ తండా ట్రాలీ ఆటో

పరిస్థితి నెలకొంది. దీంతో మొరాయించిన ట్రాలీ ఆటోలు మూలన పడగా అద్దెపై ప్రైవేట్ ట్రాక్టర్లను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సదరు జీపీలకు అదనంగా ఖర్చులు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు స్పందించి మొరాయిస్తున్న ట్రాలీ ఆటోల సమస్యను పరిష్కరించి పంచాయతీలను ఆర్థిక నష్టం నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కావ్యను భారీ మెజార్టీతో గెలిపించండి

● వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కోరారు. మండలంలోని సోమారం గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్, బీజేపీల నాయకులు కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే నాగరాజు కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతుల, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నాగరాజు

కావ్యను గెలిపించే దిశగా శ్రేణులు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, సీనియర్ నాయకులు పల్లెపాటి రతన్‌రావు, చొద రాఘవులు, ఎంపీటీసీ లావుడ్యా సరోజన లచ్చు నాయక్, వంగాల రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు కృషి



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో విద్యార్థులు

వర్ధన్నపేట : ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య తెలిపారు. తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో కళాశాలలో ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశంపై సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోషయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం టాస్క్ ద్వారా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ట్యాలీ, ఆప్టిట్యూడ్, తదితర అంశాలపై అవగాహన కలిగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ ఉద్యోగ, ఉపాధి పరీక్షల్లో ప్రతిభ చాటేలా తీర్చిదిద్దుతోందని తెలిపారు. విద్యార్థులకు ఆప్టిట్యూడ్, రీజనింగ్‌పై జె.రాజేశ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టాస్క్ టీపీఓ డాక్టర్ సుధారాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సమత, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



సంగెం : మండలంలోని కృష్ణానగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. ఎదునూరి కోటిరెడ్డి, వంగ కొమురయ్య, కసరబోయిన శ్రీనాథ్, కుక్కల రాజు, రాయపూరి శ్రీనివాస్, కొయ్యల ఎల్లయ్య, సదిరం కట్టయ్య, రాంబాబు, వేల్పుల గణేశ్, దేవరాజ్ తదితరులు పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుడ్డు రాజు, నాయకులు గోపతి కట్టయ్య, రవి, మేకల బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌ను సందర్శించే ధైర్యం లేదా?

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : పాకాలకు గోదావరి జలాలు మళ్లించే ప్రాజెక్ట్‌ను సందర్శించే ధైర్యం లేదా? అని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో పాకాల కట్టపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మాలోత్ కవితను ఎంపీగా గెలిపించాలని కోరుతూ మండలంలోని దబ్బీర్‌పేట, అశోక్‌నగర్, మంగళవారిపేట, బుధరావుపేట, ధర్మరావుపేట, ఖానాపురం, తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచారంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పాకాలకు గోదావరి జలాలు మళ్లించే ప్రాజెక్ట్‌ను బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. సీఎంను కూడా కలవలేని ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ఎద్దేవా చేశారు. మోసపూరిత హామీలు గుప్పించడానికి కాంగ్రెస్ నాయకులు పల్లెల బాట పడుతున్నారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీగా మాలోతు కవితను గెలిపించాలని కోరారు. సమావేశాల్లో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట నర్సయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, సదర్‌లాల్, బాలకిషన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఉద్యోగాల సాధనలో పోటీ పడాలి



సన్మానిస్తున్న విజయ్‌కుమార్, తదితరులు



శిబిరంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంగెం : ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో యువత పోటీ పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మండల కేంద్రానికి చెందిన రావుల క్రాంతి, చెదులూరి పరిమళ, నంగునూరి మానస, గూడెల్లి నవ్యలను మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. కృషి, పట్టుదల, ప్రణాళికతో కష్టపడి చదివి వివిధ డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాల సాధించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కరుణశ్రీ, కిషన్‌కుమార్, చిర్ర రాజ్‌కుమార్, మొగిలి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా శిక్షణ

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికాయుతంగా సిద్ధం కావాలని చెప్పారు. టీవీలు, సెల్‌ఫోన్లు, తదితరాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఏకగ్రతతో కష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవడం సులువని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొజ్జ సురేశ్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మంకాల యాదగిరి, ఉపాధ్యాయులు చిలువేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న ముగ్గురిపై కేసు

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లి శివారులోని ఎస్సారెస్పీ (కోనాయమాకుల ఎత్తిపోతల) కెనాల్ నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా జేసీబీ, ట్రాక్టర్లతో మొరం తరలిస్తున్న ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. దేగల మహేశ్, మేడిద కృష్ణ, దేవులపెల్లి కృష్ణమూర్తి మొరం తరలిస్తుండగా సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటేసేలా చర్యలు

వర్ధన్నపేట : ప్రజలు నిర్భయంగా ఓటేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల పరిశీలకుడు బండారి రణవీర్ చంద్ తెలిపారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండాలోని చెక్‌పోస్టును, పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ, ఇతర అంశాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతుల కల్పనపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ఇతరులు ఎవరు ప్రయత్నించినా చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న రణవీర్ చంద్

మతోన్మాద బీజేపీకి గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

చెన్నారావుపేట : మతోన్మాద పాలన సాగిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. మండలంలోని పాపయ్యపేటలో మహ్మద్ గోరేమియా అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ మతోన్మాద, రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. మత సామరస్యం దెబ్బతిని నియంతృత్వం విలయ తాండవం చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని సవరిస్తామంటూ బీజేపీ నాయకులు వ్యాఖ్యలు చేస్తుండడాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. బీజేపీ అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నం వెంకన్న డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్, మండల కార్యదర్శి జన్ను రమేశ్, సభ్యులు మొర్రి శ్రీను, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిల్లు తీసుకున్నా గేట్లు పెట్టరేం?

● ఏడాది గడచినా చర్యలు శూన్యం

ఖానాపురం : గోదాముల నిర్మాణానికి బిల్లు తీసుకున్నా ప్రహరీలకు గేట్లు ఎందుకు పెట్టడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తి చేసినట్లు చూపించి బిల్లు తీసుకుని ఏడాది గడచినా అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని బుధరావుపేట, అశోక్‌నగర్, ధర్మరావుపేట గ్రామాల్లో ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో గోదాంలు నిర్మించారు. ఒక్కో గోదాము నిర్మాణానికి ప్రభుత్వం రూ.29 లక్షలు మంజూరు చేసింది. 2023 మార్చిలోనే నిధులు కేటాయించారు. పాలకవర్గ సభ్యులు కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి గోదాముల నిర్మాణ పనులు చేపట్టారు. గోదాముల నిర్మాణాలను పూర్తి చేసి ప్రహరీ సైతం ఏర్పాటు చేశారు. బుధరావుపేట గోదాం ప్రహరీ, గేట్ కోసం రూ.16 లక్షలు, ధర్మరావుపేట గోదాం ప్రహరీ కోసం రూ.11 లక్షలు మంజూరయ్యాయి.



బుధరావుపేటలో గేట్ లేని గోదాం ప్రహరీ

ప్రహరీలను సైతం నిర్మించారు. బిల్లులు పూర్తిగా తీసేసుకున్నారు. గేట్లు మాత్రం ఏర్పాటు చేయకుండా వదిలేసారు. ఈ విషయాన్ని నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇకనైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి గేట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుని గోదాముల రక్షణకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో ఏర్పాటు చేయిస్తాం

గోదాముల, ప్రహరీల నిర్మాణం పూర్తి అయినా గేట్లు ఏర్పాటు చేయని విషయం వాస్తవమే. గేట్లు ఏర్పాటు చేయాలని బాధ్యులకు గతంలో తెలియజేశాము. త్వరలోనే గేట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవు.

-సంజీవరెడ్డి, డీసీఓ, వరంగల్

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

నర్సంపేట రూరల్ : అమరుల ఆశయ సాధనకు కార్మికులు ఉద్యమించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి సూచించారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 138 ఏళ్ల క్రితం చికాగో నగరంలో కార్మికులు పోరాడిన ఫలితంగా హక్కులు సాధించుకున్నట్లు తెలిపారు. నాటి అమరుల త్యాగాలను స్మరిస్తూ ప్రస్తుత పాలకుల తప్పుడు విధానాలపై ఐక్యపోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని చెప్పారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలు తప్పవన్నారు. వాడవాడలా మే డే జెండాలు ఎగరేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సోమ సారయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్, కేశెట్టి శ్రీనివాస్, కందికొండ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

టీజేఎస్‌తోనే తెలంగాణ అస్తిత్వ రక్షణ



నర్సంపేట : తెలంగాణ జన సమితి (టీజేఎస్)తోనే తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్‌లతో కలిసి జావిత్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యంగా ఐదేళ్లుగా పార్టీ పోరాటాలు నిర్మిస్తోందని చెప్పారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంటి సంజీవ, మహ్మద్ సంధాని, సోల్తి సాయికుమార్, సాంబరాతి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలిత స్ఫూర్తితో పోరాడాలి



నివాళులర్పిస్తున్న రాజుయాదవ్, నాయకులు

నర్సంపేట : హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యమ గాయని బెల్లి లలిత స్ఫూర్తితో యాదవ కులస్తులు, ప్రజలు పోరాడాలని బీసీవై పూలే వారసుల రాజ్యం అధ్యక్షుడు, గొల్ల కురుమ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు రాజు యాదవ్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో లలిత 50వ జయంతి వేడుకను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత చిత్రపటానికి రాజు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, హక్కుల కోసం లలిత గ్రామాల్లో పాటలతో ప్రజలను చైతన్యవంతం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మచ్చిక రాజుగౌడ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాదం స్వప్న, బీసీ కులాల ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు బాల్నె సుభాష్, నాయకులు మద్దబోయిన రమేశ్, కోడి అశోక్, వంగపండ్ల రాజు, గట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే మాదిగ కులస్తులకు న్యాయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పర్వతగిరి : బీజేపీతోనే మాదిగ కులస్తులకు న్యాయం జరుగుతుందని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జిల్లా ధర్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ కరపత్రాలను వారు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరుతూ దళితవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్, ధర్మయ్య మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత లభిస్తుందని చెప్పారు. మాదిగ, ఉపకులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. దళితులందరూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి బీజేపీ తరఫున బరిలో నిలిచిన అరూరి రమేశ్‌కు ఓటేయాలని సూచించారు. తద్వారా ఎస్సీ వర్గీకరణ, ఇతర హక్కుల సాధనకు బాటలు వేయాలని కోరారు.

నగదు, బియ్యం సాయం

రాయపర్తి: మండలంలోని పెర్కవేడుకు చెందిన గారె సాయిమల్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల సాయం చేశారు. అలాగే మాజీ సర్పంచ్ చిన్నాల తారశ్రీ రాజబాబు బియ్యం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి అమ్జద్ పాషా, మాజీ వార్డు సభ్యులు తాటికాయల రవి, ఐత వెంకన్న, గారె మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన చినగారి రాజు అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన డబ్బులు పంపించగా సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజు, మేకల మోహన్ తదితరులు పాల్గొన్నారు.